## క్లుప్తంగా

### ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోసిన అధికారులు



శాయంపేట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మండల కేంద్రంలోని ఇందిరమ్మ గృహ లబ్ధిదారులు నిర్మిస్తున్న ఇళ్లకు శనివారం గ్రామ పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ మార్కింగ్ చేసి ముగ్గు పోశారు. పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్ పాల్గొని మాట్లాడారు. ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు వరద రాజు, నాయకులు పాల్గొన్నారు.

### సేవారత్న అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

శాయంపేట : ప్రతిష్టాత్మకమైన మహాత్మా జ్యోతిరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఏపీజే అబ్దుల్‌కలాం సేవారత్న, సాహిత్యరత్న, ఉత్తమ సర్పంచ్, విద్యారత్నా, ఉమెన్ లీడర్షిప్ అవార్డులకు బహుజన సాహిత్య అకాడమీ ఉమ్మడి వరంగల్ కమిటీ దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు సెలక్షన్ కమిటీ సభ్యుడు బొమ్మకంటి రాజేందర్ శనివారం తెలిపారు. సెప్టెంబర్ 5న తిరుపతిలో జరిగే సాహిత్య అకాడమీ 18వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అవార్డులను ప్రధానం చేస్తారని తెలిపారు. వివరాలకు 99899496532, 7386409653 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

శాయంపేట : కొత్తగా పట్టాదారు పాస్‌బుక్కులు పొందిన రైతులు 2025వ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ గంగాజమున శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగా పట్టాదారు పాస్‌బుక్కు పొందిన రైతులు భూమి పట్టా, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లను సంబంధిత ఏఈఓకు అందించాలని కోరారు. ఈనెల 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఈనెల 5వ తేదీ వరకు పట్టా పాస్‌బుక్కులు పొందిన రైతులు అర్హులని తెలిపారు. ఇది వరకు రైతు భరోసా తీసుకుంటూ బ్యాంకు అకౌంట్ల మార్పు, చేర్పు చేసుకునే రైతులు బ్యాంకు అకౌంట్ వివరాలతో సంబంధిత ఏఈఓకు అందించాలని కోరారు. రైతు భరోసా నిధులను ఈనెల 16న సీఎం విడుదల చేస్తారని, మండలంలోని పలు గ్రామాల్లో గల రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం ఉంటుందని, వీక్షించేందుకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని నీరుకుళ్ల క్రాస్‌రోడ్డు సమీపంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం ప్రకారం.. నల్లబెల్లి మండలం సాయిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బోలుకొండ నరహరి ఆమె భార్య సౌభాగ్య(60) బైక్‌పై హనుమకొండకు వెళ్తున్నారు. ఈ క్రమంలో నీరుకుళ్ల క్రాస్‌రోడ్డు సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో సౌభాగ్య అక్కడికక్కడే మృతిచెందగా నరహరికి తీవ్ర గాయాలు అయ్యాయి. కాగా 108లో ఆయనను వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోష్ తెలిపారు.

### టీడబ్ల్యూజేఎఫ్ డివిజన్ నూతన కమిటీ ఎన్నిక

పరకాల : టీడబ్ల్యూజేఎఫ్ పరకాల డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు టీవీ రాజు, కార్యదర్శి అంతడపుల శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డివిజన్ అధ్యక్షుడిగా కోగిల చంద్రమౌళి, ఉపాధ్యక్షులుగా చెరుపల్లి సత్యం, చిట్టిరెడ్డి అజయ్‌రెడ్డి, కార్యదర్శిగా కొల్లూరి ప్రేమ్‌చంద్, కోశాధికారిగా సిలువేరు రాజు, సహాయ కార్యదర్శులుగా నాగెల్లి సంతోశ్, గీరబోయిన రాజు, కార్యవర్గ సభ్యులుగా దొమ్మాటి అంబేడ్కర్, ముక్కెర చిరంజీవి, చుక్క సతీశ్, రమేశ్‌ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

### బ్రేక్ డౌన్.. ఆందోళనలో అన్నదాతలు

హసన్‌పర్తి: త్రీఫేస్ విద్యుత్ బ్రేక్ డౌన్‌తో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఆరెపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని వంగపహాడ్‌లోని వ్యవసాయ బావులకు సరఫరా అవుతున్న విద్యుత్ సరఫరాలో పది నిమిషాలకోసారి అంతరాయం ఏర్పడుతోంది. దీంతో బోరు మోటార్లు పాడవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా ఇదే దుస్థితి నెలకొందని చెబుతున్నారు. ప్రస్తుతం వరి నారు నాటుకునేందుకు అన్నదాతులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారులు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

# నిర్మించి వదిలేశారు..!



రోడ్డు మధ్యలో సెంట్రల్ లైటింగ్ కోసం ఏర్పాటు చేసిన డివైడర్



మండల కేంద్రంలో చెత్తాచెదారంతో నిండిన మురికి కాల్వ

- సెంట్రల్ లైటింగ్‌కు లభించని మోక్షం
- డివైడర్ నిర్మించి వదిలేసిన కాంట్రాక్టర్
- వేదిస్తున్న డ్రెయినేజీ సమస్య
- పట్టించుకోని అధికారులు

వేలేరు : మండల కేంద్రానికి డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, రోడ్డుకిరువైపులా డ్రెయినేజీ ఏర్పాటు చేస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు హామీ ఇచ్చి ప్రణాళికలు రూపొందించారు. ధర్మసాగర్ మండలంలోని సాయిపేట క్రాస్ రోడ్డు నుంచి వేలేరు మండల కేంద్రం వరకు రూ.37 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణంతో పాటు రోడ్డు మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు డివైడర్‌ను నిర్మించారు. రోడ్డు నిర్మాణం పూర్తైయిన తర్వాత సెంట్రల్ లైటింగ్, రోడ్డుకిరువైపులా డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టాలని కొన్ని నెలలుగా మండల ప్రజలు కోరుతున్నా ప్రస్తుత పాలకులు, అధికారులు దాని ఊసెత్తడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అయితే అప్పటి పాలకులు డబుల్ రోడ్డు నిర్మాణానికే నిధులు కేటాయించి, సెంట్రల్ లైటింగ్ నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడంతో పనులు ఇప్పటికీ మొదలు కాలేదని పలువురు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవ తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### డ్రెయినేజీ ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉంది. డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచి వీధులు కంపుకొడుతున్నాయి. దోమలు, ఈగలు వ్యాప్తిచెంది రోగాల బారినపడుతున్నాం. వర్షాకాలం ప్రారంభమయ్యింది. డెంగీ, మలేరియా లాంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మండల కేంద్రంలో రోడ్డుకిరువైపులా డ్రెయినేజీ నిర్మించాలి.

– రాసపెల్లి సంతోశ్, వేలేరు

### సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి



మండల కేంద్రంలో మూడేళ్ల క్రితం డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టిన సమయంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని రోడ్డు మధ్యలో డివైడర్లు నిర్మించారు. సెంట్రల్ లైటింగ్‌కు నిధులు కేటాయించకపోవడంతో పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని సెంట్రల్ లైటింగ్ నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభమయ్యే విధంగా చూడాలి.

– రాజు, బీజేపీ మండల అధ్యక్షుడు

## కేటీఆర్‌పై సర్కారు కక్ష సాధింపు

- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

వేలేరు : మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఫార్ములా–ఈ కార్ రేస్ ద్వారా రాష్ట్రానికి వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కోట్లు ఖర్చు చేసి సుందరీమణుల పోటీలు నిర్వహించడం వలన రాష్ట్రానికి ఏం ప్రయోజనం జరిగిందో ప్రజలకు తెలుపాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరంపై విచారణ పేరుతో మాజీ సీఎం కేసీఆర్‌ను హరీశ్‌రావును ఫార్ములా–ఈ కార్ రేస్ విచారణ పేరుతో కేటీఆర్‌ను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే ఓటుతో తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. 18 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమిలేదని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రజాక్షేత్రంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ భూపతిరాజ్, మండల కోఆర్డినేటర్ గోవింద సురేశ్, నాయకులు కుమార్, సోమిరెడ్డి, సంపత్, శ్రీనివాస్, భిక్షపతి, మోహన్, సుధాకర్ పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ వినియోగంతో మానసిక రుగ్మతలు

- సిటిజన్ ఫోరం కన్వీనర్ విద్యాసాగర్




విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న విద్యాసాగర్

పరకాల : సెల్‌ఫోన్‌ను అవసరం మేరకు వినియోగించాలని లేని పక్షంలో అనేక మానసిక రుగ్మతలు ఏర్పడే ప్రమాదం ఉందని పరకాల సిటిజన్ ఫోరం కన్వీనర్ డాక్టర్ నాగబండి విద్యాసాగర్ అన్నారు. సాధన ఐడియల్ సొసైటీ, అక్షర కంప్యూటర్స్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన 40 రోజుల ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తికావడంతో విద్యార్థులకు ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందించడం సంతోషంగా ఉందన్నారు. సమయాన్ని వృథా చేయకుండా ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించాలని, రాత్రి సమయంలో సోషల్ మీడియాలో గడుపుతూ మెలుకువతో ఉండొద్దన్నారు. అవసరం మేరకు వినియోగించుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. సీఐ క్రాంతికుమార్, సాధన ఐడియల్ సొసైటీ కన్వీనర్ పోగాకుల రాధాకృష్ణ, కార్యదర్శి రంజిత్, అక్షర కంప్యూటర్ బోధకుడు అనుదీప్, సొసైటీ సభ్యులు రాజేందర్, శంకర్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా ఉంటా



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

ఆత్మకూరు : బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని లింగమడుగుపల్లిలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన వేముల రాజమౌళి, విమలబాయ్ కుటుంబాలను, చౌళ్లపెల్లి గ్రామంలో వివిధ కారణాలతో మృతిచెందిన రాచర్ల రవి, ఆవుల సాంబయ్య, హౌజ్‌బుజుర్గులో ఇటీవల మృతిచెందిన సయ్యద్‌లాలు కుటుంబాలను శనివారం ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉండి ఆదుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సంజీవరెడ్డి, కుమారస్వామి, నాయకులు రాజేశ్వర్‌రావు, రవియాదవ్, వేణు, మహేందర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

### చెత్త తొలగించిన జీపీ సిబ్బంది



డ్రైనేజీని క్లీన్ చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మురికి కాల్వలో పేరుకుపోయిన చెత్తను, కాల్వలో చనిపోయిన పందిని గ్రామపంచాయతీ సిబ్బంది శనివారం తొలగించారు. చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లడంతో శనివారం సాక్షి దినపత్రికలో 'గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్ పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. సమస్య పరిష్కారానికి సహకరించిన సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## గంజాయి తరలిస్తున్న నలుగురిపై కేసు



నిందితులను మీడియాకు చూపుతున్న సీఐ రంజిత్‌రావు

శాయంపేట : మండలంలోని ఆరెపల్లి గ్రామ శివారు వాటర్ ట్యాంకు వద్ద గంజాయి తరలిస్తున్న నలుగురిని ఎస్సై జక్కుల పరమేశ్ పట్టుకున్నట్లు సీఐ రంజిత్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆరెపల్లి గ్రామంలో ఎస్సై జక్కుల పరమేశ్ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా వాటర్ ట్యాంకు వద్ద నలుగురు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించినట్లు తెలిపారు. పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకుని బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి లభించిందన్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిపారు. అనంతరం గంజాయిని స్వాధీనం చేసుకుని పంచుల సమక్షంలో తూకం వేయగా కిలో 100 గ్రాములు ఉందని, విలువ సుమారు రూ.55,000 ఉంటుందని తెలిపారు. మండల కేంద్రానికి చెందిన అంగునూరి రోహిత్, గోవిందు సృజన్‌కుమార్, మారేపల్లి నితీష్‌తో పాటు ఆత్మకూరు మండలానికి చెందిన కక్కు అఖిల్ మహారాష్ట్రలోని సిరోంచ దగ్గరలో ఉండే కృష్ణ అనే వ్యక్తి దగ్గర తక్కువ ధరకి కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించేందుకు పంచుకుంటున్న క్రమంలో పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఎస్సై జక్కుల పరమేశ్, కానిస్టేబుల్ సతీశ్, శ్రీనివాస్‌ను సీఐ అభినందించారు.

## 'భూ భారతి' దరఖాస్తుల పరిశీలన



భూ భారతి దరఖాస్తులను పరిశీలిస్తున్న సిబ్బంది

శాయంపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి కార్యక్రమంలో భాగంగా ఈనెల 3 నుంచి మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కల్వల సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండో శనివారం సెలవు రోజుల్లో కూడా భూ భారతి దరఖాస్తులను సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించి నోటీసులు తయారు చేయడంలో నిమగ్నమైయ్యారని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతి, సీనియర్ అసిస్టెంట్ అచ్చారావు, ఎమ్మార్ఐ రమేశ్ ఖన్నా, ఆర్ఐ రమేశ్, సిబ్బంది విజయ్, సత్యం, కంప్యూటర్ ఆపరేటర్లు నాగరాజు, శైలజ, రాజు, తులసి తదితరులు పాల్గొన్నారు.

### మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..

శాయంపేట : మండల కేంద్రంలోని నుంచి కొత్తగట్టు సింగారం గ్రామానికి వెళ్లే బైపాస్ రోడ్డు పక్కన మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో నీరంతా వృథాగా పోతుండగా శనివారం సాక్షి దినపత్రిలో 'వృథాగా మిషన్ భగీరథ నీరు' కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన మిషన్ భగీరథ డీఈ శ్రీనివాస్, ఏఈ వహీద్ సిబ్బందితో జేసీబీ సహాయంతో మరమ్మతు చేయించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి



ఆత్మకూరు : మాట్లాడుతున్న చాపర్తి రవీందర్



ఎల్కతుర్తి : మాట్లాడుతున్న శ్రీదేవి

ఆత్మకూరు : మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని సర్వోదయ సంస్థ కోఆర్డినేటర్ చాపర్తి రవీందర్ అన్నారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో శనివారం మహిళలకు మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు హక్కులు, అవకాశాలను వినియోగించుకుని పురుషులతో సమానంగా ఎదగాలని సూచించారు. ఆడపిల్లలను చదివించడం వలన కుటుంబాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని అన్నారు. గృహ హింస ఎదుర్కొంటున్న మహిళలు ధైర్యంగా ఎదిరించాలన్నారు. బాధిత మహిళలకు సఖి 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎలుకటి రజిత, సీఏలు జయ, ప్రభాకర్, యూత్ అధ్యక్షుడు సురేశ్, కవిత తదితరులు పాల్గొన్నారు.

**ఎల్కతుర్తిలో..**

ఎల్కతుర్తి : మండలంలోని ఇందిరానగర్‌లో శనివారం సఖి సేవలపై సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి అవగాహన కల్పించారు. ప్రతీ మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గృహహింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచారాలు నుంచి రక్షణ పొందేందుకు సఖి సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. కేస్ వర్కర్ భారతి, జ్యోతి, సుమలత, రాధిక తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పథకానికి నిధులు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రాములు

న్యూశాయంపేట: ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచి రెండువందల రోజుల పనిదినాలు కల్పించాలని భారతీయ కిసాన్ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకట్రాములు డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్ల పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం నిర్వీర్యం చేసేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ శక్తుల అనుకూల విధానాలు విడనాడి కార్మిక, కర్షక ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం పాటుపడకుంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేశ్, నాయకులు కర్రె లక్ష్మణ్, ఏదునూరి వెంకట్రాజం, బి.భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

### పెండింగ్ బిల్లులు చెల్లించాలి



రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్‌లు

నడికూడ : గ్రామాభివృద్ధిలో భాగంగా చేసిన పనులకు ఇప్పటికీ బిల్లులు రాలేదని మాజీ సర్పంచ్‌లు తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర రోడ్డు రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వంతో మాట్లాడి తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు విడుదల చేయించాలని ఈ సందర్భంగా మంత్రిని కోరినట్లు తెలిపారు. అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నామని వాపోయారు. మాజీ సర్పంచ్‌లు సుర్వి యాదయ్య, ఊర రవీందర్, బొట్ల సంధ్యారవి, పాలకుర్తి సదానందం, రావుల సరిత రాజిరెడ్డి ఉన్నారు.

## నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలి



మోడల్ హౌజ్‌ను పరిశీలిస్తున్న సీఈ చైతన్యకుమార్

ఆత్మకూరు : ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ గృహాలు నిర్మించుకోవాలని ఇందిరమ్మ పథకం చీఫ్ ఇంజనీర్ చైతన్యకుమార్ సూచించారు. మండల కేంద్రంలోని మోడల్ హౌజ్ నిర్మాణంతో పాటు తిరుమలగిరి, కామారం గ్రామాల్లో ఇందిరమ్మ గృహ నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇంటి నిర్మాణానికి ఎంత అవసరమో అంతే స్టీల్, తదితర ముడి సరుకు వినియోగించాలన్నారు. గృహ నిర్మాణ సామగ్రిని లబ్ధిదారులంతా కలిసి కొనుగోలు చేస్తే తక్కువ వ్యయం అవుతుందన్నారు. మేస్త్రీలు ఎక్కువ కూలీ తీసుకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ పీడీ సిద్దార్థనాయక్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు అనూష, లావణ్యతో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ నాయకుల పరిశీలన**

ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తనుగుల సందీప్ కోరారు. మండల కేంద్రంలో శనివారం లబ్ధిదారులతో మాట్లాడి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను వివరించారు.

## పదవుల్లో పెరికలకు ప్రాధాన్యం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంగని మల్లేశ్వర్

నయీంనగర్: పార్టీ నామినేటెడ్ పదవుల్లో పెరిక కులస్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పెరిక కుల ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పెప్సీ) జాతీయ అధ్యక్షుడు సంగని మల్లేశ్వర్ కోరారు. ఎమ్మెల్సీ నియామకాల్లో, మంత్రివర్గ విస్తరణలో సామాజిక న్యాయం పాటించి, కామారెడ్డి డిక్లరేషన్ అమలు దిశగా సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. పెరిక కులానికి టీపీసీసీ, దాని అనుబంధ సంఘాలు, రాష్ట్ర, జిల్లా స్థాయి నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. హనుమకొండ శంకర్‌నగర్ కాలనీ పెప్సీ కార్యాలయంలో శనివారం జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు నియోజకవర్గాల్లో ఓట్లను ప్రభావితం చేయగలిగే అధిక బలం ఉన్న పెరిక కులానికి నామినేటెడ్ పదవులు ఇవ్వకపోవడం శోచనీయమని మల్లేశ్వర్ అన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు శ్రీరాం వీరయ్య, గుమ్మళ్ల మల్లికార్జున్, సతీష్‌కుమార్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, వీర ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

## చేగువేరా జీవితం స్ఫూర్తిదాయకం



చేగువేరాకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: చేగువేరా జీవితం స్ఫూర్తిదాయకమని ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ అన్నారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఉద్యమ నేత చేగువేరా 97వ జయంతిని శనివారం నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ అర్జెంటీనాలో జన్మించిన చేగువేరా.. వైద్య, ఇంజనీరింగ్, విద్యలను అభ్యసించి, ఆనాడు లాటిన్ అమెరికా సామ్రాజ్యవాదం దుశ్చర్యలకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, అభిరామ్ రమేష్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

### తైక్వాండో సంఘం కార్యదర్శి హఠాన్మరణం



సారంగపాణి (ఫైల్)

వరంగల్ స్పోర్ట్స్: గుండెపోటుతో వరంగల్ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి వావిలాల సారంగపాణి (56) శుక్రవారం అర్ధరాత్రి హఠాన్మరణం చెందారు. అతడి ఆరోగ్యం బాగాలేకపోవడంతో హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేస్తుండగానే సారంగపాణికి గుండెపోటుకు గురై మృతి చెందారు. వరంగల్ కాశిబుగ్గకు చెందిన సారంగపాణి అనేక ఏళ్లు హనుమకొండలోని ఇండోర్ స్టేడియంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన శిక్షణలో అనేక మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించారు. సారంగపాణి అంత్యక్రియలు కాశిబుగ్గలోని శ్మశానవాటికలో శనివారం నిర్వహించారు. సారంగపాణికి భార్య విజయ, కుమారుడు నరసింహ, కూతురు సంకీర్తన ఉన్నారు. సారంగపాణి మృతిపై వివిధ క్రీడా సంఘాలు బాధ్యులు, క్రీడాకారులు సంతాపం తెలిపారు.